# థెస్సలోనికయులకు వ్రాసిన మొదటి పత్రిక

1 తండ్రియైన దేవునికి ప్రభువైన యేసు క్రీస్తుకు చెందిన
థెస్సలొనీకయుల సంఘానికి,
పౌలు, సీల, తిమోతి* అనే మేము వ్రాయునది:
మీకు కృపా సమాధానాలు కలుగును గాక.

## థెస్సలొనీకయుల విశ్వాసాన్నిబట్టి కృతజ్ఞతలు

2 మేము ప్రార్థించిన ప్రతిసారి మీ అందరి గురించి దేవునికి
కృతజ్ఞతలు చెల్లిస్తున్నాము.
3 దేవునిపై మీకున్న విశ్వాసంతో చేసిన కార్యాలు, ప్రేమ చేత
ప్రేరేపించబడిన మీ ప్రయాసం, మన ప్రభువైన యేసు క్రీస్తులో మీకున్న
నిరీక్షణ వలన మీరు చూపుతున్న ఓర్పును మేము మన తండ్రియైన
దేవుని ఎదుట మానక జ్ఞాపకం చేసుకుంటున్నాము.
4 దేవుని ప్రేమను పొందిన సహోదరీ సహోదరులారా, దేవుడు
మిమ్మల్ని ఆయన ప్రజలుగా ఎన్నుకున్నాడనే సంగతి మాకు తెలుసు.
5 ఎందుకంటే, మేము మీకు సువార్తను కేవలం సాధారణ
మాటలతో కాక పరిశుద్ధాత్మ శక్తితో బలమైన విశ్వాసంతో
ప్రకటించాము. మీ గురించి మేము మీ మధ్యలో ఎలా జీవించామో
మీకు తెలుసు.
6 మీరు తీవ్రమైన శ్రమల మధ్యలో పరిశుద్ధాత్మలోని
సంతోషంతో వాక్యాన్ని స్వీకరించి, మమ్మల్ని ప్రభువును పోలి
నడుచుకుంటున్నారు.

* **1:1** గ్రీకులో సిల్వాను సీల యొక్క మరో రూపం

7 కాబట్టి మాసిదోనియ అకాయ ప్రాంతాల్లో ఉన్న విశ్వాసులందరికి
మీరు మాదిరిగా ఉన్నారు.
8 అందుకని మీ వలన ప్రభువును గురించిన వాక్యం కేవలం
మాసిదోనియ అకాయ ప్రాంతాల్లో మారుమ్రోగడమే కాకుండా మీలో
దేవునిపై ఉన్న విశ్వాసాన్ని గురించి ప్రతిచోట తెలిసింది. కాబట్టి దాని
గురించి మేము చెప్పవలసిన అవసరం లేదు,
9 ఎందుకంటే మీరు మాకు ఇచ్చిన ఆతిథ్యం ఎలాంటిదో వారే
సాక్ష్యమిస్తున్నారు. సజీవుడైన నిజమైన దేవున్ని సేవించడానికి మీరు
విగ్రహాలను విడిచిపెట్టి ఎలా దేవుని వైపుకు తిరిగారో,
10 మరణం నుండి ఆయన లేపిన, రాబోయే ఉగ్రత నుండి మనల్ని
కాపాడబోవుచున్న, పరలోకం నుండి రాబోతున్న ఆయన కుమారుడైన
యేసు కోసం మీరు ఎంతగా ఎదురుచూస్తున్నారో వారే చెప్తున్నారు.

# 2

## థెస్సలొనీకయలో పౌలు పరిచర్య

1 సహోదరీ సహోదరులారా! మేము మీ దగ్గరకు రావడం వ్యర్థం
కాలేదని మీకు తెలుసు.
2 మీకు తెలిసినట్టే, మేము ఫిలిప్పీలో ముందు శ్రమపడి దౌర్జన్యాన్ని
అనుభవించాం కాని మన దేవుని సహాయంతో తీవ్రమైన వ్యతిరేకత
ఎదురవుతున్నా ధైర్యంగా ఆయన సువార్తను మీకు ప్రకటించాము.
3 సువార్త విషయమై మిమ్మల్ని ప్రాధేయపడడంలో మాకేమి
తప్పుడు ఉద్దేశాలు లేవు, మేము మిమ్మల్ని మోసం చేయడం లేదు.
4 దానికి బదులు, దేవుడు మాకు ఈ సువార్తను అప్పగించడానికి
ఆయనచే యోగ్యులుగా ఎంచబడిన వారిలా మేము బోధిస్తున్నాము.
కాబట్టి మేము మనుష్యులను మెప్పించడానికి కాకుండా
మన హృదయాలను పరిశీలించే దేవుని మెప్పించడానికి
ప్రయత్నిస్తున్నాము.

5 మేము ఎన్నడు ముఖస్తుతి చేయలేదు, మేము అత్యాశను
దాచిపెట్టే ముసుగును వేసుకోలేదని మీకు తెలుసు; దాని గురించి
దేవుడే మాకు సాక్షి.
6 మేము క్రీస్తు అపొస్తలులుగా మా అధికారాన్ని ప్రదర్శించే
అవకాశం ఉన్నా ప్రజల నుండి గాని మీ నుండి గాని ఇతరుల నుండి
గాని వచ్చే ఘనతను మేము ఆశించలేదు.
7 కాని, మీ మధ్యలో చిన్నబిడ్డల్లా మృదువుగా ఉన్నాము.
పాలిచ్చు తల్లి తన పిల్లలను ఎలా చూసుకుంటుందో,
8 మేము మిమ్మల్ని శ్రద్ధగా చూసుకున్నాము. ఎందుకంటే మేము
మిమ్మల్ని ప్రేమించాం, కాబట్టి మేము మీతో దేవుని సువార్తను
పంచుకోవడమే కాక మీ కోసం మా ప్రాణాలను సైతం ఇవ్వడానికి
సిద్ధపడ్డాము.
9 సహోదరీ సహోదరులారా! మేము పడ్డ మా ప్రయాసాన్ని
మా కష్టాన్ని మీరు జ్ఞాపకం చేసుకోండి, మేము ఎవరికి భారంగా
ఉండకూడదని దేవుని సువార్తను మీ మధ్య ప్రకటించినప్పుడు,
మేము రాత్రింబవళ్ళు పని చేసి మమ్మల్ని మేము పోషించుకున్నాము.
10 విశ్వాసులైన మీ మధ్య మేము ఎంత భక్తిగా, నీతిగా ఎలాంటి
నిందలేనివారిగా ఉన్నామో దానికి మీరే సాక్షులు, అలాగే దేవుడు సాక్షి.
11 తండ్రి తన సొంత పిల్లల పట్ల ఉన్నట్లు మేము మీ పట్ల
నడుచుకొన్నామని,
12 మిమ్మల్ని తన రాజ్యంలోనికి, మహిమలోనికి పిలిచే దేవునికి
తగినట్లుగా మీరు జీవించాలని మిమ్మల్ని ప్రోత్సహిస్తూ, ఆదరిస్తూ
వేడుకొంటున్నాను.
13 అంతేకాక, మేము ప్రకటించిన దేవుని వాక్యాన్ని మీరు
గ్రహించినందుకు, మీరు వాటిని మనుష్యుల మాటలుగా కాకుండా
అవి నిజంగా దేవుని మాటలు అని, విశ్వసించినవారిలో అవి
కార్యరూపం దాల్చుతాయని మీరు అంగీకరించినందుకు మేము
దేవునికి మానక కృతజ్ఞతలు తెలుపుచున్నాము.

14 సహోదరీ సహోదరులారా, మీరు క్రీస్తు యేసులో ఉన్న
యూదయలోని దేవుని సంఘాల్లా నడుచుకోవడం మొదలుపెట్టారు:
యూదుల వలన ఆ సంఘాలు శ్రమపడిన విధంగానే మీరు కూడా మీ
సొంత ప్రజల నుండి శ్రమపడ్డారు.
15 వారే ప్రభువైన యేసు క్రీస్తును, ప్రవక్తలను చంపారు మనల్ని
బయటకు తరిమేశారు. వారు దేవునికి కోపం కలిగిస్తారు, అందరితో
విరోధంగా ఉంటారు.
16 యూదేతరులకు రక్షణ కలిగించే బోధను మేము అందించకుండా
వారు మమ్మల్ని అడ్డగించాలనే ప్రయత్నాలతో వారు తమ పాపాలను
అంతులేకుండా పెంచుకుంటున్నారు. కాని దేవుని ఉగ్రత వారి మీదకు
రానే వచ్చింది.

## థెస్సలోనీయులను చూడాలని పౌలు కోరిక

17 సహోదరీ సహోదరులారా, మీ నుండి కొంతకాలం శరీరరీత్యా
దూరంగా ఉన్నా, ఆలోచనలో మీకు ఎప్పుడు దగ్గరగానే ఉన్న మాకు
గల గొప్ప ఆశను బట్టి మిమ్మల్ని చూడాలని ప్రతి ప్రయత్నం చేశాము.
18 మేము మీ దగ్గరకు రావాలనుకున్నాము, నిజంగా పౌలును
నేను అనేకసార్లు రావాలని ప్రయత్నించాను, కానీ సాతాను మమ్మల్ని
ఆటంకపరిచాడు.
19 మన ప్రభువైన యేసు క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు ఆయన ఎదుట
మా నిరీక్షణ, ఆనందం, మా గౌరవ కిరీటం ఎవరు? అది మీరు కాదా?
20 నిజానికి, మీరే మా గౌరవ కిరీటం, ఆనందమై ఉన్నారు.

# 3

1 కాబట్టి మేము ఇంకా వేచి ఉండలేదా మేము ఏథెన్సులోనే
ఉండడం మంచిదని తలంచాము.
2 మా సహోదరుడు దేవుని పరిచర్యయైన యేసు క్రీస్తు సువార్తను
ప్రకటించడంలో మా తోటిపనివాడైన తిమోతిని, మీ విశ్వాసంలో
మిమ్మల్ని ప్రోత్సహించి బలపరచడానికి పంపించాము,

3 ఎందుకంటే, అప్పుడు మీలో ఎవరు ఏ శ్రమల వలన కలవరం
చెందకుండా ఉండాలని. అయినా మనం శ్రమలను ఎదుర్కోవలసి
ఉందని మీకు బాగా తెలుసు.
4 నిజానికి, మనకు శ్రమలు వస్తాయని, మేము మీతో ఉన్నపుడు
మీతో చెప్తూనే ఉన్నాము. అలాగే జరిగిందని మీకు తెలుసు.
5 ఏదో ఒక రీతిగా శోధకుడు మిమ్మల్ని శోధిస్తాడని, అప్పుడు మేము
చేసిన పని అంతా వ్యర్థమై పోతుందని నేను భయపడ్డాను, కాబట్టి ఇక
నేను వేచి ఉండలేక మీ విశ్వాసం గురించి తెలుసుకోవాలని తిమోతిని
పంపించాను.

### తిమోతి యొక్క ప్రోత్సాహకరమైన నివేదిక

6 అయితే ఇప్పుడే తిమోతి మీ నుండి మా దగ్గరకు వచ్చి,
మీ విశ్వాసం గురించి, మీరు చూపిన ప్రేమ గురించి మంచి
వార్తను మాకు అందించాడు. మీరు మమ్మల్ని ఎల్లప్పుడూ మాకు
సంబంధించిన మంచి జ్ఞాపకాలతో జ్ఞాపకం చేసుకుంటూ, మేము
మిమ్మల్ని చూడాలని ఎలా ఆరాటపడుతున్నామో అలాగే మీరు కూడా
మమ్మల్ని చూడాలని ఆరాటపడుతున్నారని అతడు మాతో చెప్పాడు.
7 కాబట్టి సహోదరీ సహోదరులారా, మేము హింసించబడినప్పుడు
బాధను కష్టాలను అనుభవిస్తున్న సమయంలో మీ విశ్వాసాన్ని
గురించి విన్నప్పుడు మేము ఆదరణ పొందుకున్నాము.
8 ఎందుకంటే, మీరు దేవునిలో స్థిరంగా నిలబడి ఉండడం మాకు
ప్రాణం వచ్చినట్లే.
9 మీ వలన దేవుని సన్నిధిలో మేము పొందిన సంతోషమంతటిని
బట్టి దేవునికి మీ కోసం కృతజ్ఞతాస్తుతులు ఎంతని చెల్లించాలి?
10 మిమ్మల్ని మరలా చూడాలని మీ విశ్వాసంలో ఉన్న
లోపాన్ని సరిచేయాలని రాత్రింబగళ్ళు మీ కోసం ఎంతో పట్టుదలతో
ప్రార్థిస్తున్నాము.
11 మన తండ్రియైన దేవుడు, ప్రభువైన యేసు క్రీస్తు మేము త్వరగా
మీ దగ్గరకు రావడానికి మార్గం సరాళం చేయును గాక!

12 మేము మీ పట్ల ప్రేమ చూపినట్లే, విశ్వాసులైన మీరు ఒకరిపట్ల
ఒకరు మీ ప్రేమను వృద్ధిపొందించుకొంటూ ఇతరులందరికి ఆ ప్రేమను
అందించేలా ప్రభువు చేయును గాక.
13 మన ప్రభువైన యేసు తన పరిశుద్ధులందరితో
కలిసివచ్చినపుడు మన తండ్రియైన దేవుని ముందు మీరు
నిందారహితులుగా పవిత్రులుగా ఉండడానికి ఆయన మీ
హృదయాలను బలపరచును గాక.

# 4

## దేవునికి ఇష్టులుగా జీవించుట

1 సహోదరీ సహోదరులారా, చివరిగా, దేవునికి ఇష్టులుగా ఎలా
జీవించాలో మేము మీకు బోధించిన ప్రకారం మీరు కూడా అలాగే
జీవిస్తున్నారు. మీరు ఇలాగే ఇకముందు కూడా జీవించాలని ప్రభువైన
యేసులో మేము మిమ్మల్ని వేడుకుంటున్నాము.
2 ప్రభువైన యేసులో గల అధికారంతో మేము మీకు ఏమి
బోధించామో మీకు తెలుసు.
3 మీరు లైంగిక దుర్నీతికి దూరంగా ఉంటూ పరిశుద్ధులుగా
ఉండడమే దేవునికి ఇష్టం;
4 మీలో ప్రతివారు మీ సొంత శరీరమనే పాత్రను పరిశుద్ధంగా,
ఘనత కలిగినదిగా ఉండేలా దానిపై నియంత్రణ కలిగి జీవించాలి.
5 దేవుని ఎరుగనివారి కామోద్రేకాన్ని కలిగి ఉండవద్దు.
6 ఈ విషయంలో తన సహోదర సహోదరీలను అలుసుగా తీసుకుని
మోసం చేయకూడదు. ఎందుకంటే, మేము ముందుగానే మీకు చెప్పి
హెచ్చరించిన ప్రకారం అలాంటి పాపాలను చేసిన వారందరిని ఈ
క్రియల విషయాల్లో ప్రభువు శిక్షిస్తారు.
7 పరిశుద్ధ జీవితాన్ని జీవించడానికే దేవుడు మనల్ని పిలిచాడు
గాని అపవిత్రులుగా ఉండడానికి పిలువలేదు.

8 కాబట్టి ఈ నియమాన్ని నిర్లక్ష్యం చేసినవారు మనుష్యులను
నిర్లక్ష్యం చేయడమే కాకుండా, మీకు తన పరిశుద్ధాత్మను ఇచ్చిన
దేవున్నే నిర్లక్ష్యం చేస్తున్నారు.

9 ఒకరిని ఒకరు ప్రేమించుకోవడం మీరు దేవుని నుండి
నేర్చుకున్నారు కాబట్టి మీలో ఒకరిపట్ల ఒకరికి గల ప్రేమ గురించి
మీకు వ్రాయాల్సిన అవసరం లేదు.
10 నిజానికి, మాసిదోనియ అంతటా ఉన్న దేవుని
కుటుంబమంతటికి ప్రేమ చూపిస్తున్నారు. అయినా సహోదరీ
సహోదరులారా, మీరు ఇంకా అధికంగా ప్రేమించాలని చెప్తున్నాము.
11 ఆ ప్రేమ ద్వారా సమాధానకరమైన జీవితాన్ని గడపడమే మీ
ధ్యేయంగా పెట్టుకొని, మేము మీకు చెప్పిన విధంగా ఇతరుల జోలికి
పోకుండా మీ సొంత విషయాలనే చూసుకుంటూ మీ చేతులతో
కష్టపడి పని చేయండని మిమ్మల్ని వేడుకొంటున్నాము.
12 అప్పుడు మీ అనుదిన జీవితం బయటి వారి గౌరవాన్ని
గెలుచుకుంటుంది, మీరు ఎవరిపైనా ఆధారపడేవారిగా ఉండరు.

## మరణించిన విశ్వాసులు

13 సహోదరీ సహోదరులారా, చనిపోయినవారి గురించి మీకు
తెలియకుండా ఉండడం మాకిష్టం లేదు. మీరు నిరీక్షణలేని ఇతరుల్లా
దుఃఖించకండి.
14 యేసు చనిపోయి తిరిగి లేచారని మనం నమ్ముతున్నాం కాబట్టి,
ఆయనలో నిద్రించినవారిని దేవుడు యేసుతో పాటు తీసుకువస్తారని
నమ్ముతున్నాము.
15 ప్రభువు చెప్పిన మాటను బట్టి మేము మీతో చెప్పేది ఏంటంటే,
ప్రభువు తిరిగి వచ్చేవరకు బ్రతికి ఉండే మనం చనిపోయినవారికంటె
ముందుగా ఆయన సన్నిధికి చేరము.
16 ప్రభువే స్వయంగా పరలోకం నుండి గొప్ప అధికార శబ్దంతో
మాట్లాడడాన్ని వింటారు, అలాగే ప్రధానదూత మాట్లాడే శబ్దాన్ని

వింటారు, బూర ధ్వనితో ఆయన దిగి వస్తారు, అప్పుడు క్రీస్తులో
చనిపోయినవారు మొదట లేస్తారు.
17 ఆ తర్వాత మిగతా బ్రతికి ఉన్న మనం వారితో పాటు
కలసి, ప్రభువును కలుసుకోడానికి ఆకాశమండలానికి మేఘాల మీద
కొనిపోబడతాము. అప్పుడు మనం సదాకాలం ప్రభువుతో కూడా
ఉంటాము.
18 ఆ కారణాన్ని బట్టి, మీరు ఈ మాటల చేత ఒకరిని ఒకరు
ప్రోత్సహించుకోండి.

# 5

## ప్రభువు దినం

1 సహోదరీ సహోదరులారా, యేసు క్రీస్తు రాకడ ఎప్పుడు
సంభవిస్తుందో ఆ కాలాలు, సమయాల గురించి మేము మీకు
వ్రాయాల్సిన అవసరం లేదు,
2 ప్రభువు దినం రాత్రి దొంగలా వస్తుందని మీకు బాగా తెలుసు.
3 ప్రజలు, మేము, “నెమ్మది కలిగి సురక్షితంగా ఉన్నాం” అని
అనుకుంటున్నప్పుడు, ఒక గర్భిణి స్త్రీకి పురుటినొప్పులు వచ్చునట్లు
వారి పైకి నాశనం అకస్మాత్తుగా వస్తుంది, కాబట్టి వారు దాని నుండి
తప్పించుకోలేరు.

4 అయితే సహోదరీ సహోదరులారా, ఆ దినం దొంగలా మిమ్మల్ని
ఆశ్చర్యపరచడానికి మీరు చీకటిలో లేరు.
5 మీరంతా వెలుగు సంతానం పగటి సంతానము. మనం చీకటికి
లేదా రాత్రికి చెందినవారం కాదు.
6 కాబట్టి మనం నిద్రపోతున్న ఇతరుల్లా ఉండకుండా, మెలకువ
కలిగి తెలివిగా ఉందాము.
7 నిద్రపోయేవారు రాత్రివేళ నిద్రపోతారు, మత్తులుగా ఉండేవారా
రాత్రివేళ మత్తులై ఉంటారు.

8 అయితే మనం పగటికి చెందినవారం కాబట్టి తెలివి కలిగి,
విశ్వాసం ప్రేమ అనే కవచాన్ని, రక్షణ పొందాలనే ఆ ఆశాభావాన్ని
శిరస్త్రాణంగా ధరించుకొంటాము.
9 ఎందుకంటే దేవుడు మనల్ని ఉగ్రతను అనుభవించడానికి
నియమించలేదు కాని, మన ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా రక్షణ
పొందడానికే నియమించారు.
10 ఆయన తిరిగి వచ్చినప్పుడు మనం లోకంలో జీవించి ఉన్నా
లేదా మరణించినా ఆయనతో పాటు మనం జీవించాలని క్రీస్తు మన
కోసం చనిపోయారు.
11 కాబట్టి మీరిప్పుడు చేస్తున్నట్లుగానే ఒకరిని ఒకరు
ప్రోత్సహించుకొంటూ ఒకరిని ఒకరు బలపరచుకోండి.

## తుది నియమాలు

12 సహోదరీ సహోదరులారా, మీ మధ్యలో
ప్రయాసపడుతున్నవారిని, ప్రభువులో మీ కోసం శ్రద్ధ చూపించేవారిని,
మిమ్మల్ని హెచ్చరించేవారిని గౌరవించాలని మేము మిమ్మల్ని
ప్రాధేయపడుతున్నాము.
13 వారి పనిని బట్టి వారిని ప్రేమతో అధికంగా గౌరవించండి.
ఒకరితో ఒకరు సమాధానం కలిగి ఉండండి.
14 సహోదరీ సహోదరులారా, సోమరులను హెచ్చరించమని,
క్రుంగిపోయినవారిని ప్రోత్సహించమని, బలహీనులకు సహాయం
చేయమని, అందరితో సహనం కలిగి ఉండమని మేము మిమ్మల్ని
వేడుకుంటున్నాము.
15 మీలో ఎవరూ కీడుకు ప్రతిగా కీడు చేయకుండ చూసుకోండి,
అలాగే అందరికి మంచి చేయడానికే ఎల్లప్పుడూ ప్రయత్నించండి.
16 ఎల్లప్పుడు ఆనందించండి;
17 విడువక ప్రార్థించండి,
18 మీరు ప్రతి విషయం కోసం కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలని క్రీస్తు
యేసులో మీ పట్ల దేవుని ఉద్దేశము.

19 ఆత్మ ప్రేరణను ఆర్పకండి.
20 ప్రవచనాలను తిరస్కరించకండి.
21 అన్నిటిని పరీక్షిస్తూ మంచి వాటిని గట్టిగా పట్టుకోండి,
22 ప్రతీ కీడును తిరస్కరించండి.
23 సమాధానకర్తయైన దేవుడు తానే స్వయంగా మిమ్మల్ని
సంపూర్ణంగా పరిశుద్ధపరచును గాక. మీ పూర్ణాత్మను, మనస్సును
దేహాన్ని మన ప్రభువైన యేసు క్రీస్తు రాకడలో నిందారహితంగా
కాపాడును గాక.
24 మిమ్మల్ని పిలిచేవాడు నమ్మకమైనవాడు, కాబట్టి ఆయన
ఖచ్చితంగా చేస్తారు.

25 సహోదరీ సహోదరులారా, మాకోసం ప్రార్థించండి.

26 దేవుని ప్రజలందరికి పవిత్ర ముద్దుతో వందనాలు.

27 సహోదరీ సహోదరులందరికి ఈ పత్రికను చదివి వినిపించాలని
ప్రభువు పేరట మిమ్మల్ని ఆదేశిస్తున్నాను.

28 మన ప్రభువైన యేసు క్రీస్తు కృప మీతో ఉండును గాక.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.

You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."

Notice of copyright must appear on the title or copyright page of the work as follows:

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.

"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.

You must also make your derivative work available under the same license (CC BY-SA).

If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6